క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో తిరువీధి



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

సింహాచలం: మీన సంక్రమణాన్ని పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం సాయంత్రం గ్రామ తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ముస్తాబు చేసి పల్లకీలో అధిష్ఠంపజేసి తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఘనంగా వీడ్కోలు వేడుక



సరస్వతి పూజ చేస్తున్న పదో తరగతి విద్యార్థులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల కలిసి సరస్వతీ దేవి పూజ చేశారు. ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్, జీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ ఆర్.స్వరూప పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



పందివానిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం, దలాయిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీవో లలితకుమారి గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఇంటి వద్ద పిల్లలకు నేర్పించాల్సిన సాంప్రదాయ ఆట వస్తువుల తయారీని తల్లులకు వివరించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వి.నీలిమ, కనకలక్ష్మి, ఎం.రాజేశ్వరి, పి.వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్, విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ పరవాడ సెక్షన్ ఏఈ శేషసాయి తెలిపారు. ఫలితంగా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, దలాయిపాలెం, దోసూరు పంచాయతీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు గమనించాలని ఏఈ శేషసాయి కోరారు.

వీధిదీపాల ఏర్పాటు



గొరపల్లిలో వీధి దీపాలు అమరుస్తున్న విస్తం కళాశాల బృందం

పెందుర్తి: మండలంలోని గొరపల్లిలో పినగాడి విస్తం ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు సామాజిక బాధ్యత కింద పలు చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కళాశాల దత్తత గ్రామం అయిన గొరపల్లిలో స్మార్ట్ సోలార్ దీపాలు వేసి ప్రిన్సిపాల్ బి.శివకుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఉన్నత భారత్ అభియాన్ కో ఆర్డినేటర్లు సాగర్, వెంకటరావు, మణికంఠ, సతీష్, వైస్ ప్రిన్సిపాల్ జాషువా పాల్గొన్నారు.

4,610 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా గురువారం పిఠాపురంకాలనీ, పాతరేసవానిపాలెం, ఎన్‌జీజీవో కాలనీ, రంగిరీజువీధి, భీమనగర్, భవానీగార్డెన్స్, కంచరపాలెం, పెదగంట్యాడ, అక్కిరెడ్డిపాలెం, బుచ్చిరాజుపాలెం, మధురవాడలో వైద్య శిబిరాలు జరిగాయి. ఈ శిబిరాల్లో మొత్తం 4,610 మందికి వైద్య సేవలందించారు.

మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ పెద్దపీట

- ఐదేళ్లలో మహిళల ప్రగతికి ఎనలేని కృషి
- వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.184.54 కోట్లు లబ్ధి
- విజయోత్సవ సభలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్



వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు నమూనా చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: అడుగడుగునా మహిళల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఐదేళ్ల పాలనలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఆర్థికంగా ప్రోత్సాహం అందించారని చెప్పారు. స్వయం ఉపాధి సాధించేలా పలు పథకాలు అమలు చేశారన్నారు. పెందుర్తి రూరల్ మండల పరిధిలో వైఎస్సార్ ఆసరా విజయోత్సవ సభను పెందుర్తిలోని తాండ్రపాపారాయుడు భవన్‌లో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకంలో నాలుగు విడతలు కలిపి నియోజకవర్గంలోని మహిళలకు రూ.184.54 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. దేశానికే రోల్ మోడల్‌గా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ప్రతీ పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ దేశ చరిత్రలో నిలిచిపోతారన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు ఒక్క పథకమైనా సక్రమంగా అమలు చేశాడా అని ప్రశ్నించారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ప్రతిపక్షాలు, పచ్చ మీడియా కుట్రలను ఛేదిస్తూ సీఎం వైఎస్ జగన్ వెంట అంతా ఉండాలని కోరారు.

జంబో చెక్ అందజేత

పెందుర్తి గ్రామీణం, జీవీఎంసీ పరిధిలోని 2419 ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌ల్లోని లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా జంబో చెక్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ముందుగా లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఏసీ సత్యంనాయుడు, ఎంపీపీ మధుపాడ నాగమణి, మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు సూర్యప్రకాష్, సర్పంచ్‌లు గొరపల్లి శ్రీను, కొయిలాడ శ్రీను, ఉగ్గిన దేముడు, మాజీ సర్పంచ్ గొరపల్లి సాంబ, నాయకులు ముదపాక శివ, సారిపల్లి గణేష్, కేసుబోయిన త్రినాథ్, గిరి, ఏపీఎంలు శ్రీనివాస్, రమణ వీవోఏలు, ఆర్పీలు, వేలాదిగా మహిళలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తం అవసరం

డాక్టర్ వెంకట సుష్మా



డాక్టర్ వెంకట సుష్మాను సత్కరిస్తున్న ఫార్మా ఉద్యోగులు

పరవాడ: క్యాన్సర్ వ్యాధుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పి.వెంకట సుష్మా సూచించారు. జేఎస్ ఫార్మాసిటీలోని ఎంఎఎస్ఆర్ఎం భవనంలో గురువారం క్యాన్సర్ వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధి నివారణ చర్యలు, చికిత్స విధానాలపై ఫార్మా పరిశ్రమల మహిళా ఉద్యోగులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జాతీయ భద్రతా వారోత్సవాలు, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో ఎస్.రాజ్యలక్ష్మి, కె.అప్పారావు, కె.తిలక్‌లు విజయం సాధించారు. వీరికి ఎంఎఎస్ఆర్ఎం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివరాంప్రసాద్, జెట్టి సుబ్బారావు అభినందించారు. డాక్టర్ పి.వెంకట సుష్మాను అసోసియేషన్ తరఫున ఘనంగా సత్కరించారు.

బీజేపీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి



సినిమాహాలు కూడలిలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ కార్యకర్తలు

పరవాడ: రైతులకు ద్రోహం చేసిన బీజేపీకి రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ రైతులకు పిలుపునిచ్చారు. కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు పరవాడ సినిమాహాలు కూడలిలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, రుణ విముక్తుల్ని చేస్తామని హామీ ఇచ్చి నేడు రైతులను ఆత్మహత్యలకు పురిగొల్పుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పల్లి అప్పారావు, ఎస్.చిన్నారావు, ఎం.గోవిందు, జి.ప్రసాదు, నాయుడు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ



కల్యాణ మండపం నిర్మాణానికి పార్టీ నాయకులతో కలిసి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని చిన్నయ్యపాలెంలో నూతనంగా నిర్మించనున్న కల్యాణ మండపం పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం భూమిపూజ చేశారు.పార్టీ నాయకులు,అధికారులతో కలిసి ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.24 లక్షల జాతీయ రహదారి పరిహారంతో కల్యాణ మండపాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ గొర్లి ఉమా మహేశ్వరరావు,వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం రామునాయుడు,బోను గంగునాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడీ బాబు,జెట్టి హేమంత్,పంచామతీ రాజ్ ఏఈ అర్జున అప్పారావు, పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు, గొర్లి కృష్ణ,సబ్బవరపు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లు అందిస్తున్న రొటరాక్ట్ క్లబ్ ప్రతినిధి ప్రహర్షారెడ్డి, ఆశీష్

పెందుర్తి: నగరంలోని రొటరాక్ట్ క్లబ్ పెందుర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు మూడు కంప్యూటర్లు అందించింది. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రహర్షారెడ్డి, ఆశీష్‌లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్‌కు వీటిని అందించారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు డాక్టర్ ఎం.నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పాల్గుణ పక్షోత్సవ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు



ఆలయ ప్రాంగణంలో తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై పాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి.

మహాలక్ష్మి అమ్మవారికి శ్రీసూక్త పారాయణం, ప్రత్యేక పూజలు జరిపారు. లక్ష్మీ హవనం, కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో తులాభారం నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

పీఎం పాలెం : పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రుషికొండ మొహరం హాస్టల్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన టీవీఎస్ షోరూమ్ యజమాని కాసిన రమేష్ కుమారుడు కాసిన జస్వంత్ (19) రుషికొండలోని మొహరం హాస్టల్‌లో వుంటూ గీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం 7 గంటలకు జస్వంత్ రూమ్మేట్ మధన్ రూముకు వచ్చేసరికి డోర్ లాక్ చేసి ఉంది. మారుతాళంతో డోర్ ఓపెన్ చేయగా జస్వంత్ బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే అతని స్నేహితులు కిందకు దించి గీతం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే... జస్వంత్‌కు పిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించామని తల్లిదండ్రులకు హాస్టల్ వార్డెన్ ఫోనులో తెలియజేయడం గమనార్హం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు



ప్రహరీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డులోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. పార్లుపాలెంలో రూ.31.19 లక్షలతో నిర్మించిన సామాజిక భవనం ప్రహరీ, గ్రామంలోని డ్రైనేజీలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ వార్డులో దీర్ఘకాలికంగా ఉన్న ఎన్నో సమస్యలను ఇటీవల కాలంలో పరిష్కరించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాపర్తి మాధవరావు, ఆకుల గుణాకర్, పెదగాడి చిన్నారావు, కాకర మల్లయ్య, రాపర్తి కాశీ, గంత కోరు వెంకటరమణ, ఆర్ఎస్‌వీ రమణ, గేదెల మంగ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


సర్వేను అడ్డుకున్న రైతులు



ఆందోళన చేస్తున్న రైతులు

సింహాచలం: తమకు ఎలాంటి సమాచారం లేకుండా రోడ్డు పనులు చేస్తున్నారని విజినిగిరిపాలెం, లండగరువు రైతులు సర్వే పనులను అడ్డుకున్నారు. వివరాలు...అడవివరంలోని లండగరువు విజినిగిరిపాలెం మీదగా సింహాచలం వరకు కొత్తగా రోడ్డు వేసేందుకు వీఎంఆర్‌డీఏ అప్పట్లో మాస్టర్‌ప్లాన్ రూపొందింది. సేర్వ బాధ్యతలకు జీవీఎంసీ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. రెండు రోజులుగా లండగరువు సమీపంలో జంగిల్ క్లియరెన్స్ పనులను ఆ ప్రైవేటు సంస్థ చేస్తోంది. అయితే తమకు సమాచారం లేకుండా తమ స్థలాల్లో పనులు ఎలా చేస్తారని గురువారం రైతులు పనులను అడ్డుకున్నారు. తమకు జీవీఎంసీ సర్వే పనులు అప్పగించిందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. దేవదాయశాఖ అనుమతులు, సింహాచలం దేవస్థానం అనుమతులు ఉన్నాయని సర్వే బృందం తెలిపింది. అడవివరం మాజీ సర్పంచ్ పాశర్లప్రసాద్ రైతులతో గొంతు కలిపారు. రైతులకు పూర్తి సమాచారం ఇవ్వాలనడంతో సర్వే బృందం అక్కడి నుంచి వెళ్లిపోయింది.

డాల్ఫిన్ నోస్ వద్ద పోలీసు ఔట్‌పోస్టు ప్రారంభం



పోలీస్ఔట్ పోస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న సీపీ రవిశంకర్, నేవీ అధికారులు

సింథియా : మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని డాల్ఫిన్‌నోస్ హిల్స్ వై జంక్షన్ వద్ద పోలీస్ ఔట్ పోస్ట్‌ను నేవీ అధికారులతో కలిసి నగర సీపీ రవిశంకర్ గురువారం ప్రారంభించారు. హార్బర్ సబ్ డివిజన్‌లోని నేవీ ప్రాంతంలో గల యారాడ, లైట్ హౌస్ వంటి పర్యటక ప్రాంతాలకు చేరువలో పోలీస్ ఔట్ పోస్ట్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఆ ప్రాంతంలో ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టవేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టినట్టు అవుతుందన్నారు. అత్యవసర సమయాల్లో సైతం పోలీసులు అందుబాటులో ఉండేలా ఈ ఔట్‌పోస్ట్ నిర్విరామంగా పనిచేసేలా సిబ్బంది, పాటు డిస్‌ప్లే, సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ద్విచక్రవాహనాలను సైతం అందుబాటులోకి ఉంచుతామన్నారు. కార్యక్రమంలో నేవీ కమాండర్ హ్యాపీమోహన్, సచిన్ షిండే, జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీ-2 సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సభకు రేవంత్‌రెడ్డి

సీతంపేట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 16న స్టీల్ ప్లాంట్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఆ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్‌రెడ్డి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఏపీలో 175 అసెంబ్లీ , 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు 1,350 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజులు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, మూల వెంకటరావు, ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నృసింహ యజ్ఞం విజయవంతం చేయాలి

సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీవరకు సింహగిరిపై జరిగే శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనేలా ట్రస్ట్‌బోర్డు సభ్యులు, విభాగాధిపతులు కృషి చేయాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సూచించారు. యజ్ఞం నిర్వహణకు సంబంధించిన విధివిధానాలపై గురువారం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, విభాగాధిపతులు, వైదిక సిబ్బందితో ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం నిర్వహించే మహాయజ్ఞం విజయవంతంగా జరిగేలా అందరూ కృషి చేయాలని సూచించారు. దాదాపు పదేళ్ల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా యజ్ఞం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

రాజగోపురం ఎదురుగా నిర్వహణ

ఆలయ .ఉత్తర రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేయనున్న యాగశాల, హోమగుండాలు, భక్తులు యజ్ఞంలో కూర్చునే ప్రదేశాలపై సమావేశంలో అర్చకులు వివరించారు. యజ్ఞం జరిగే రోజుల్లో సాయంత్రం వేళ రోజుకో వాహనంపై సింహగిరి మాడవీధుల్లో స్వామివారి తిరువీధి జరుగుతుందని తెలిపారు. పెద్ద ఎత్తున కోలాటాలు, భజనలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, ప్రత్యేక ఆహ్వానితుడు నరసింహమూర్తి, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు రమణమూర్తి, నరసింగరావు,భ్రమరాంబ, సూపరింటెండెంట్‌లు పిల్లా శ్రీనివాసరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి వార్షిక జాతర



సత్తెమ్మను దర్శించుకుంటున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, శ్రీనుబాబు తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ పొలిమేరదేవత సత్తెమ్మతల్లి వార్షిక జాతర మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున అమ్మవారిని అర్చకులు సుప్రభాతసేవతో మేల్కొలి ఆరాధన నిర్వహించారు. స్వర్ణ ఆభరణాలుతో అమ్మవారిని అలంకరించారు.అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అమ్మవారికి చీరలు, పసుపుకుంకుమలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అడవివరం, బాలాజీనగర్, శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం,అప్పన్నపాలెం, సింహపురికాలనీ తదితర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మజ్జిగ, మంచినీరు, ప్రసాదం అందజేశాయి.రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమలు ఆకట్టుకున్నాయి. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, 93వవార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు, కమిటీ సభ్యులు గంట్ల కనకరాజు, బలిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉజ్వల భవిత



పదోతరగతి విద్యార్థులకు ఆశీస్సులు అందజేస్తున్న గొడవర్తి శ్రీనివాసాచార్యులు

సింహాచలం: కఠోర శ్రమ, క్రమశిక్షణతో కూడిన చదువు ఏ వ్యక్తినైనా ఉన్నత స్థానానికి తీసుకువెళ్తారని సింహాచలం దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తెలిపారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో పదోతరగతి ఎంతో కీలకమైనదని తెలిపారు. సాధన చేస్తే సాధించలేనిది ఏదీ ఉండదని గుర్తు చేశారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. 1973వ సంవత్సరంలో ఇదే పాఠశాలలో తాను చదువుకున్నానని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు హాల్‌టికెట్‌లు అందజేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మల్లునాయుడుపాలెంలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సబ్బవరం: సమగ్ర సస్యరక్షణ, పోషకాల యాజమాన్యం చేయడం ద్వారా వేరుశనగ పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు ఎం.రామారావు తెలిపారు.మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో రైతులు సాగుచేసిన వేరుశనగ,నువ్వు పంటల క్షేత్రాలను ఆయన గురువారం సందర్శించారు. సస్యరక్షణ, ఎరువుల వినియోగం గురించి సూచనలు,సలహాలు అందించారు. నీటి ఆధారంగా వేసుకున్న రబీ పంటలకు యూరియాను 20 నుంచి 30 రోజుల పంట దశలో వేయాలని సూచించారు. పంట పూత దశలో,ఊడలు వేస్తున్న దశలో జిప్సం వేసుకోవడం వల్ల కాయలు నిబ్బరంగా తయారవ్వడమే కాకుండా గింజలు బరువుగా రావడానికి అవకాశం ఉంటుందన్నారు.అనంతరం సబ్బవరం మండల వ్యవసాయ కేంద్రంలో మండలంలోని వ్యవసాయ,ఉద్యాన సహాయకులతో రైతు భరోసా కేంద్రాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ పెద్దలు,రైతులు బోను గంగునాయుడు,ఎంపీటీసీ కనకరాజు, ఏఈవో బాలరాజు, వీఏఏ హేమలత తదితరులు పాల్గొన్నారు.

400 ఎంపీ సీట్లు సాధించడమే లక్ష్యం : ఎంపీ జీవీఎల్

ఎంవీపీకాలనీ: దేశంలో 400 ఎంపీ సీట్లు సాధించడమే ఎన్‌డీఏ కూటమి లక్ష్యమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ నగర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీలో 20 ఎంపీ సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో ఈ నెల 17న జరగనున్న సభలో ఆయన పాల్గొంటారని చెప్పారు. విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేయనున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ అధిష్టానం ఆదేశాల మేరకే పోటీ ఉంటుందన్నారు.